

# ప్రేముడి

## - మంథా భానుమతి



*(గత సంచిక తరువాయి)*

**కృష్ణా జిల్లా డెల్టా** ప్రాంతంలో ఒక లంక అది. రెండు పక్కలా కృష్ణానది పాయలు, ఒక పక్క సముద్రం.. మధ్యలో ఉన్న లంక. ఆ లంకలో ఉన్నవి నాలుగు పల్లెలు.

ఆ పల్లెల్లో ఒకటి.. 'నువ్వులారి పాలెం'. నూటాభై గడప ఉంటుంది ఆ పల్లెలో. నూలపాలెం అంటారు వాడుకలో.

ఏది కావాలన్నా టౌను కెళ్ళాల్సిందే. అక్కడికెళ్ళాలంటే కృష్ణానది పాయ దాటాలి. స్వతంత్రం వచ్చి ఇన్నేళ్ళయినా ఇంకా అక్కడ బ్రిడ్జ్ కట్టలేదు. అంతకు ముందు నాటు పడవల్లోనే దాటే వారు. ఆ తరువాత వాటికి మోటార్లు బిగించారు.

మోటారు బోటు వచ్చాక కాస్త బైటి ప్రపంచంతో బాంధవ్యాలేర్పడ్డాయి నూలపాలెం ప్రజలకి. పాలెం లోని పిల్లలు.. ఇద్దరు ముగ్గురైనా అవనిగడ్డ వచ్చి కాలేజీల్లో చదువుతున్నారు. పాలెంలో ప్రభుత్వ పాఠశాల, ఒక గ్రంధాలయం, ఒక ప్రాధమిక ఆసుపత్రి వచ్చాయి.

ఇరవై మంది వరకూ లూనా మోటరు బైకులు నడుపుతారు. వాళ్ళనే బాబ్బాబు అని బతిమాలి, పెట్రోలుకి డబ్బులిచ్చి.. రేవు దగ్గరకెళ్ళొస్తుంటారు నడవలేని కొందరు.

ఆ పెట్రోలుకి డబ్బుల్లేని వాళ్ళు కాళ్ళని నమ్ముకోవలసిందే.అదీ.. సగం అరిగిపోయిన హవాయి చెప్పులతో. ఊరికి కిలోమీటరు దూరంలో మంచినీళ్ళ బావి ఉంది. ఎవరైనా అక్కడికెళ్ళి మంచినీళ్ళు తెచ్చుకోవలసిందే. ఇళ్ళలో బావుల్లో అంతా ఉప్పు నీరే. కష్టమ్మీద పప్పు ఉడుకుతుంది.

ఏదైనా.. చేపలవనీ, కాయగూరలవనీ, కిరాణా సరుకులవనీ.. గంపల్లో పెట్టి, ఆ గంపని నెత్తి మీద పెట్టుకుని నడుస్తారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పడవల రేవు కెళ్ళి, మోటారు బోటెక్కేస్తుంటారు.

ఆ పడవల్లోనే.. నావ కున్న శక్తికి మించి ఎక్కించేసి నడిపేస్తుంటారు పడవ్వాళ్ళు.. అత్యాశకి పోయి.

అదే జరిగింది ఆ రోజు. ఊర్లో అందరికీ ఉప్పెనొచ్చినట్టు వచ్చి పడ్డాయి అవసరాలు. అవే వాళ్ల ప్రాణాలు తీశాయి. మరునాడు, విలేఖరులు.. రాజకీయ నాయకులు వచ్చే సరికి ఏముంది? ఏమీ ఎరగనట్టు మామూలుగా ప్రియుడి ఒడిలో వాలిపోవాలని ప్రేయసి చూపించినంత ఉత్సాహంతో కృష్ణమ్మ సముద్రం కేసి గలగలా పారుతోంది.

పడవ మునిగిన జాడే లేదు, మళ్ళీ ట్రిప్పుకని ఎదురు చూస్తున్న యువకుల్లో కొందరు ఇంజనీరింగ్ స్టూడెంట్లు.. సర్వే కని నూలపాలెం వచ్చారు. వాళ్ళు తీసిన సెల్ఫోన్లలో ఫొటోలని బట్టి అక్కడ అంత ఘోరం జరిగిందని తెలిసింది. నీళ్ళంటే భయం లేని వాళ్ళు, గజ ఈత గాళ్ళూ నదిలో దూకి వీలయి నంత మందిని కాపాడారు.

ఆ సంఘటనని రకరకాలుగా వర్ణిస్తూ.. సెల్ ఫోన్ లలో తీసిని ఫొటోలని పదే పదే చూపిస్తూ.. అన్ని ఛానల్స్ వాళ్ళూ నాలుగు రోజులు చూపించారు.

"ఇరవై ఒకటో శతాబ్దంలో, ఆధునికత పరుగులిడుతున్న మన దేశంలో.. ఇంకా ఇటువంటి గ్రామాలున్నాయంటే నమ్ముతారా? తమ పదేళ్ళ పాలనలో ప్రభుత్వం ఏం చేసింది? కొత్త ప్రభుత్వమైనా నడక దారి వంతెనైనా కడుతుందా?" అనేక ప్రశ్నలు వేస్తూ. రాజకీయ నాయకుల్ని విసిగించేశారు. ప్రతిపక్షాల దాడి చెప్పనే అక్కర్లేదు.

అనేక విధాలుగా, వివిధ విశ్లేషకులతో చర్చలు జరిగాయి.

ఉన్నట్లుండి ఆ మారుమూల పల్లె ప్రాముఖ్యం సంతరించుకుంది. యమ్మెల్యే వచ్చి పరిసరాలని పరీక్షించి, అవసరమైన సహాయం చేస్తామని ప్రమాణం చేశారు. చనిపోయిన వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇస్తామన్నారు.  అక్కడితో ఆ సంఘటనని పాత కాగితాల అడుక్కీ, ఛానల్స్ లోని ఆర్కైవ్స్ లోకి పంపించేశారు.

పాలెంలో మామూలుగానే రోజులు గడుస్తున్నాయి.

2

"ఒక్క దానివీ ఎట్టుంటావే.. మా ఇంటికొచ్చెయ్యి వేణీ! ఎట్టా ఉండేదానివే.. ఎట్టయి పోయినావో చూడు. ఇంక పన్లోకి, మదుసుల్లోకి పడాలి. మనవాళ్ళనే వాళ్ళు ఉన్నా లేకపోయినా పొట్ట నింపుకోక తప్పదు.. బట్ట కట్టకా తప్పదు. లే.. ముందీ కాపీ తాగు." ప్రేమనంతా కంఠంలోకి వంపి బతిమిలాడుతున్న వెంకమ్మని శూన్యంలోకి చూస్తున్నట్లు చూసింది కృష్ణవేణి.

మొహం అంతకీ కళ్ళే కనిపిస్తున్నాయి. బుగ్గలు లోతుకు పోయి, పళ్ళు బైటికొచ్చేశాయి. ఏం తిన్నా తినకపోయినా రోజూ చేపలు తినడంతో నిగనిగ లాడుతున్నట్లుండే చర్మం.. పొడారిపోయి.. పొడలు తేలి పోయింది. వెలిసిపోయిన పరికిణీ, జాకెట్టు.. ఇంకాసేపటిలో పేలికలైపోతుందేమో అన్నట్టున్న ఓణీ.. మూర్తీభవించిన శోక దేవతలాగ కృష్ణవేణి మూలనున్న దేవదారు పెట్టి మీద కూర్చునుంది.

ఒక గదీ, ఆనుకుని చిన్న వంటిల్లూ ఉన్న పెంకుటిల్లది. నెల క్రితం వరకూ కలకల్లాడుతూ ఉండేది. కృష్ణవేణి అన్న.. రాజా, అవనిగడ్డెళ్ళినప్పుడు ఏదో సినిమా చూసొచ్చి, ఆ కథని మళ్ళీ ఇంకో సినిమా చూసే వరకూ చెప్తుండేవాడు. రోజూ చేపల వేటకి వెళ్ళాల్సిందే. వేటలో పట్టిన చేపల్ని, అమ్ముకునొచ్చి ఇంట్లోకి సరుకులు తెచ్చేవాడు. సరుకులతో పాటుగా చెల్లికి రిబ్బన్లు, ఫేస్ పౌడరూ కూడా.. ఒక రోజున పెద్ద అద్దం తెచ్చి గోడకి బిగించాడు. ఆ రోజంతా కృష్ణవేణి సంబరవే సంబరం.

ఆ సంబరాన్ని చూస్తున్న అన్నగారు ఆనందిస్తుంటే, తల్లిదండ్రులకి కన్నుల పండుగే.

తనకి గుర్తున్నప్పటి నుంచీ ఒక్క రోజు కూడా అన్న కోపంగా తనని మాట అనడం వినలేదు. ఏదో ఆకతాయి తనానికి తప్ప. ఉన్నరోజు తినడం, లేని రోజు నీళ్ళు తాగి పడుక్కోడం. ఉన్నా లేకపోయినా కబుర్లకేం లోటులేదు ఎన్నడూ!

ఆ ఒంటి గదిలో ఒంటరిగా మిగిలిపోయింది కృష్ణవేణి. రోజూ వెంకమ్మే నాలుగు మెతుకులు తెచ్చి బలవంతాన తినిపిస్తోంది. కృష్ణమ్మ కన్నెర్ర చేసి నెలయింది. అప్పుడప్పుడే పల్లె ప్రజలంతా తమ దిన చర్యల్లోకి దిగుతున్నారు.

ఉప్పెనలో కొట్టుకు పోయిన వాళ్ళు ముప్పై మంది లెక్కకొచ్చారు.

ఉపద్రవాలొచ్చినప్పుడు ఒకళ్ళిద్దరూ.. నలుగురూ అయితే పేర్లు చెప్పుకుంటారు. పదిమంది దాటితే ప్రజలకి తెలిసేది అంకెలే.. ఆయా కుటుంబాలకి తప్ప.

ఒకటి నుంచీ పదేళ్ళలోపు.. ఆరుగురు పిల్లలు బతికారు. నలుగురికి, తండ్రులు కూడా ఒడ్డుకి చేరగలిగారు. ఆ ఉధృతంలో ఎవరు ఎక్కడున్నారో.. ఎవరు ఎవర్ని ఒడ్డుకు చేరుస్తున్నారో.. అంతా గందరగోళం. ఆ పిల్లలకి ఫరవాలేదు.. ఉనికికి హాని లేదు. ఇళ్ళల్లో బామ్మలూ, తాతలూ ఉన్నారు. తండ్రుల ప్రేమైనా దక్కింది.

ఇద్దరు మాత్రం.. నాలుగేళ్ళ అబ్బాయి నాగరాజు, రెండేళ్ళ పాపాయి నాంచారి.. అనాధలయి పోయారు. కుటుంబం అంతా కొట్టుకు పోయింది. కృష్ణవేణికి లాగే! వెంకమ్మ, సాంబడుల పక్కిల్లే వాళ్ళది. ముందు ఒక వరండా, వెనుక ఒక గది ఉన్న తాటాకుల ఇల్లు. వెంకమ్మే ఆ వయసులో వాళ్ళ ఆలనా పాలనా చూస్తోంది.

వెంకమ్మకి నలభై ఏళ్ళే దాటినా.. మొయ్యగలిగిన కంటే ఎక్కువ భారాన్ని మోయించి, చెయ్యగలిగిన కంటే ఎక్కువే పనిని చేయించి, శరీరాన్ని దుర్వినియోగ పరిచి.. ముసలి రూపు వచ్చేసింది. ఎక్కడి కక్కడ కీళ్ళు కీచుమంటుంటాయి.

అసలే అంతంత మాత్రపు ఆదాయాలు. ఏ రోజు కా రోజు ఏదో విధంగా సంపాయించుకోవాలిసిందే.. చేపలు పట్టో, ఎండ్రకాయలేరో, టౌన్లో కూలి పనికెళ్ళో! మహా ఐతే నాలుగైదురోజులు పనికి వెళ్ళకుండా గడపగలరేమో! ఆ పైన ఇళ్ళల్లో కూర్చుంటే పస్తులే..

“అమ్మడూ! నీకే గదే నే చెప్పేది.. అంతలేసి గుడ్లేసుకుని అట్ట చూత్తవేమే! నిన్ను చూసుకునే నే బతుకుతున్నా. లేచి తానం పానం చూడే కాసింత..” వెంకమ్మ కూడా ఓపిక లేనట్లు బొంగురు గొంతుతో నీరసంగా అంది. వేణి ఉలక్కుండా పలక్కుండా కూచుంది.

వాకిట్లో బిందె చప్పుడు విని నెమ్మదిగా, నేల మీద రెండు చేతులూ ఆనించి, కష్టపడి లేచి నిలుచుంది వెంకమ్మ. కళ్ళు తిరిగినట్టనిపించింది. తనకి మాత్రం ఏమైనా ఎక్కుతోందా నోట్లోకి.. బతికుండాలి కనుక ఒకటో రెండో ముద్దలు నోట పడేసి నడుస్తోంది.

బిక్కుబిక్కుమంటూ, నోట్లో వేలేసుకుని నాంచారీ, దాని వెనుకే నాగరాజూ వచ్చారు. దిక్కు తెలియని పక్షుల్లా దీనంగా చూస్తున్నారు. ఆకలని చెప్పటం కూడ చేత కావటం లేదు. వాళ్ళకి ఏం జరుగుతోందో.. అమ్మా, అయ్యా ఎక్కడికెళ్ళారో.. అంతా అయోమయం. వాళ్ళింక రారని తెలిసిపోయింది. నిద్దరొచ్చినప్పుడు తమ గుడిసెలోకెళ్ళి, తెలివి రాగానే బైట కొచ్చేస్తున్నారు.

నాంచారి ఏడిచినప్పుడు, వెంకమ్మ ఊరడించి కాస్త అన్నం తినిపిస్తోంది. ఊర్లో అందరి స్థితీ అట్లాగే ఉంది. ఎవరూ ఎవర్నీ ఆదుకునేట్లు లేరు.

వెంకమ్మ మొగుడు, చాలాకాలం క్రితమే.. టౌను కెళ్ళి దివి సీమ మీద ఉన్నట్టుండి ఊడిపడ్డ ఉప్పెనలో తల్లీ తండ్రితో సహా కొట్టుకుపోయాడు. ఆడపనీ, మగపనీ చేసుకొస్తూ, సాంబడ్ని సాకింది. అన్నా, వొదినె కూడా ఆ వూరు రావలసి వచ్చింది, టౌన్నుంచి.

“ఏందే.. అట్ట నిలబడ్డారు. ఏం జెయ్యాల నేను.. పదండి రెండు చెంబులు నీళ్ళోత్తా.. ఎట్ట కంపు కొడ్తన్నారో చూడండి. సాంబ మామ నీళ్ళు తెచ్చినట్టున్నాడు. కాస్త మట్టి రాసి తోమతా. సబ్బుముక్కుంది గానీ ఈ నీటికి బంకై చత్తుంది.”

అప్పుడే సాంబడు, టాంకు నుంచి నీళ్ళు తెచ్చి గోలెంలో నింపుతున్నాడు. పాలెంలో గవర్న్ మెంటు కట్టిన నీళ్ళ టాంకులున్నాయి. లారీలతో రెండ్రోజులకోసారి నింపుతారు.. కానీ ఉప్పు నీళ్ళే. తాగటానికి, కాలవ కెళ్ళి తెచ్చుకోవాల్సిందే, నీళ్ళొదిలినప్పుడు.

పిల్లలిద్దర్నీ చెరో చేత్తో పట్టుకుని వంగుని గుమ్మం దాటి బయటికి రాబోయింది వెంకమ్మ.

సరిగ్గా గుమ్మం నడిమధ్యకి వచ్చే సరికి కొద్దిగా తలెత్తిందో ఏమో.. ఠక్కని నెత్తికి వాసం తగిలి, బొక్క బోర్లా పడిపోయింది. పిల్లలిద్దరికీ ఏంగాలేదు.. కానీ భయ పడి పోయి, గోడ పక్కకెళ్ళి కెవ్వుమని ఏడుపులు మొదలెట్టారు.

సరిగ్గా అప్పుడే, చివరి బిందె తీసుకుని సాంబడు వచ్చాడు.

తల్లిని నెమ్మదిగ లేవదీసి, చుట్టూ చూశాడు. ఏడుస్తున్న పిల్లలు.. నిర్వికారంగా పెట్టె మీద కూర్చున్న కృష్ణవేణి. అత్త కింద పడితే కూడా పట్టించుకోకుండా, చలనం లేకుండా కూర్చుంది.

నిస్సహాయతతో కూడిన కోపం.. ఏం చెయ్యలేని ఉక్రోషం.. మొహం ఎర్రగా అయిపోయింది సాంబడికి. వెంకమ్మని గోడ వారగా కూర్చోపెట్టి, భుజం మీదున్న తుండు తీసి తడిపి, నెత్తికి చుట్టాడు. వెంకమ్మ కళ్ళు మూసుకుని కూర్చుంది, స్పృహలో లేనట్టు.. పిల్లలు ఏడుస్తూనే ఉన్నారు.

పక్కకి తిరిగి చూశాడు. కృష్ణవేణి అట్లాగే నిశ్చలంగా కూర్చునుంది.

ఎంతో అపురూపంగా చూసుకోవాలనుకున్నాడు. తన ప్రేమనంతా రంగరించి మూటకట్టి కృష్ణవేణి దోసిట్లో పొయ్యాలనుకున్నాడు. తనకి ఊహ తెలిసిన నాటినుంచీ కలల్లో తేలిపోయాడు. అనుకున్నవన్నీ జరిగితే విధి గొప్పేముంది?

నెల రోజుల్నుంచీ ఓపిక పట్టాడు. ఎంత కాలం? ముసలి తల్లి ముప్పొద్దులా చాకిరీ చేసినట్టే ఉంటాంది. ఏం.. ఆమెకి మాత్రం బాధ లేదా? ఎందుకా తాపత్రయం.

ఆవేశం ఆగలేదు సాంబడికి. ఒక్క ఉదుట్న లేచి కళ్ళు పెద్దవి చేసి చూస్తున్న కృష్ణవేణి దగ్గరగా వెళ్ళి విసురుగా చెయ్యి పట్టి లేపాడు.

మొహం ఎదురుగా పెట్టి, చాచి చెంపదెబ్బ వేశాడు.

ఆ బలానికి కింద పడిపోయింది. లేపి, ఇంకోటి వేద్దామని చెయ్యెత్త బోయాడు. కృష్ణవేణి కళ్ళనుంచి జలజలా నీళ్ళు కారిపోతున్నాయి. అట్లాగే దెబ్బతినడానికి తయారయింది.. కానీ మాట లేదు. జుట్టంతా విడిపోయి, వీపంతా పరుచుకుంది. ఆ జుట్టుని ఇంకొక చేత్తో పట్టి తన దగ్గరగా లాగాడు.

అంతా చూస్తున్న పిల్లలు వెంకమ్మ దగ్గరికి వెళ్ళి, రెండు చేతుల్తో తట్టి లేపారు.

"ఏందిరా? పిచ్చెక్కిందా? ఏందా పని? కళ్ళల్లో పెట్టి చూస్కోవాల్సిన పిల్లని అట్టా చంపేత్తావా ఏంది?" లేని ఓపిక తెచ్చుకుని, కొడుకు చెయ్యి విడిపించి, గుండెకి హత్తుకుంది మేనకోడల్ని.

"అవునే.. పిచ్చే ఎక్కింది. ఎన్ని రోజులిట్టా.. స్మశానంలో ఉంటన్నామా, ఊర్లో ఉంటన్నామా? జనమ మెత్తాక చావకుండా ఉంటామా? చచ్చినోళ్ళతో మనవూ చత్తామా? నడ్డొంగిపోయి, కాళ్ళు ఈడ్చుకుంటా నువ్వూ.. కంట్లో నీటిని గుండెలోకి తోసేత్తూ నేనూ..ఇట్టా ఈవె గార్ని సాగదీత్తా ఉండాలా? నాకు తిక్క రేగిందంటే, తీస్కెల్లి సముద్రంలోకిసిరి పారేత్తానంతే. ఛత్.."

ఆవేశంతో ఊగిపోతున్న కొడుకుని ఒక పక్క.. భయంతో, దుఃఖంతో వణికి పోతున్న మేనకోడల్ని ఒక పక్క.. రెండు చేతుల్తో పట్టుకుని కింద కూర్చోపెట్టింది.

లేచి వెళ్ళి చీర కొంగు తడిపి, ఒకళ్ళ తరువాత ఒకరి మొహం తుడిచింది. సత్తు గ్లాసులో నీళ్ళు తీసుకొచ్చి ఇద్దరికీ, పసి పిల్లలకి తాపించి నట్లు తాపించింది.

జరుగుతున్నదంతా చూస్తున్న పిల్లలు మూలకెళ్ళి, చెరో బొటనవేలూ నోట్లో పెట్టుకుని కూచున్నారు.

"కట్టాలొచ్చినప్పుడే కాసింత ధైర్నం ఉండాలత్రా. అన్నీ సరాసరిగా పోతున్నప్పుడు మనం చేసేదేవుంది.. మన గొప్పతనవేవుంది? ఇట్టా ఆగం అయినప్పుడే మన సత్తా ఏంటో తెలిసేది. నీళ్ళు తాగితే కడుపులో ఉండి పోతయ్యా? కుంచెం ఆగి బైటికెళ్ళిపోవూ? అట్టగే మడిసి ఈ భూమ్మీద పడ్డప్పుడు పైకి పోక తప్పదు. ఎక్కడునుంచొచ్చాడో తెలవదు. ఎక్కడికెళ్తాడో తెలవదు. మద్దినున్నప్పుడే ఈ మోహాలన్నీ. ఉన్నంతకాలం తినకా తప్పదు. ఆ తిండి సంపాయించుకోకా తప్పదు. సంపాయించుకోనానికి వెంపర్లాడకా తప్పదు. మీరిద్దరూ చిన్నోళ్ళు. ఉన్నంతలో సంతోసంగా ఉండాలి. నన్నూ సంతోసపెట్టాలి. ఇంక ఉసూరంటూ ఉంటం మానెయ్యండి. ఆ పిల్లల సంగతి ఏదో చూడాలి మనవే."

వెంకమ్మ మంద్రస్వరంతో చెప్తూనే ఉంది.. తన కృష్ణవేణిని కొట్టినందుకు న్యూనతతో తలొంచుకుని సాంబడూ, కళ్ళ నిండా నీళ్ళతో వెంకమ్మనే చూస్తూ కృష్ణవేణీ విన్నారు. వింటూ మనసుకి పట్టించుకున్నారు. ఎవరికీ ఎంత సమయం గడిచిందో గుర్తు రాలేదు.

భీకర యుద్ధరంగంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన గీతోపదేశానికి ఏమాత్రం తీసిపోదు... తనదైన భాషలో, తనకున్న జ్ఞానంతో వెంకమ్మ చేసిన బోధ. నెల క్రితం ఆ పల్లెలో జరిగింది కూడా యుద్ధరంగానికి ఏమాత్రం తక్కువ కాదు. కాకపోతే అక్కడ మరణించిన వారు

ధర్మానికి విరుద్ధంగా నడిచిన వారు కాదు. ఏవో చిన్న చిన్న మనస్పర్థలు తప్ప అందరూ ప్రేమతో కలిసి మెలసి ఉండే వారే.

మరి.. ఎందుకంత విలయ తాండవం? ప్రకృతి కూడా తన ధర్మం తను పాటించిందనుకోవాలా! ఆటుపోట్లు మనిషికెట్లాగో గాలికీ, నీటికీ అగ్నికీ అంతే అనుకోవాల్సిందే.

"ఆరోజు అంత మంది ఆ పడవే ఎందుకెక్కాలి? కిష్టమ్మకెందుకు కోపం రావాలి? ఆ భగమంతుడు కూడా ఏవీ చెప్పలేడ్రా.. పిల్లలు చూడండి.. శోషొచ్చి పడి పోయారు. వీళ్ళ నేంచెయ్యాలన్నది మనం ముందుగా చూడాల్సిన పని. ఇప్పటికైతే.. అన్నం వొండేశా.. వేణమ్మా! వాళ్ళకి తానం చేపించి, నువ్వు కూడా చేసి బట్టలు మార్చుకున్రా. కాస్తంతైనా పడెయ్యకపోతే.. కడుపులో నారాయణుడు ఊరుకోడు."

వెంకమ్మని లేపి నించోపెట్టి, సాంబడు, అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

కృష్ణవేణి కూడా లేచి కళ్ళు తుడుచుకుని, పిల్లల దగ్గరికెళ్ళి లేపింది.

"అక్కా!" సంభ్రమంగా చూశాడు నాగరాజు. నాంచారి మాట్లాడలేదింకా. నోట్లో వేలుంచుకునే కృష్ణవేణి కొంగు గట్టిగా పట్టుకుంది.. ఆ పట్టులోనే తన చిన్ని మనసులో భావాన్ని చెప్తూ.

కృష్ణవేణికి కడుపు తరుక్కు పోయింది. తనైతే మాట్లాడగలదు.. తన పని తాను చూసుకోగలదు. ఈ చిన్నారులు? వాళ్ళ కెవరున్నారు? ముందు ముందేం చెయ్యాలన్నది తర్వాత. అప్పటి మట్టుకైతే మనిషి జన్మెత్తినందుకు తను చెయ్యగలిగింది చెయ్యాలి కదా!

నాంచారిని ఎత్తుకుని చంకనేసుకుని, నాగరాజుని నడిపిస్తూ, నీళ్ళ గోలెం దగ్గరికి తీసుకెళ్ళింది. వాళ్ళ వెనుకే వెంకమ్మ వచ్చి అక్కడున్న దణ్ణెం మీద పాత తుండు పడేసి లోపలికెళ్ళింది. బండ మీద కాస్త ఉల్లిపాయ తొక్కు నూరదామని.

కృష్ణవేణి, నాగరాజుని రాతి మీద నిల్చోపెట్టి బట్టలిప్పింది. వెన్నెముకకి అంటుకుపోయింది కడుపు. చూడలేక.. కాసేపు కళ్ళు మూసుకుంది. గట్టిగా ఊపిరి పీల్చి వదిలి, చెంబుతో నీళ్ళు పోసింది వాడి వంటి మీద. ఆ పసి వాళ్ళ మీద తెలియని ప్రేమ, ఆప్యాయతా విరుచుకు పడ్డాయి, కృష్ణవేణి గుండె లోతు ల్లోంచి.

ఎంత అమాయకంగా ఉన్నారు.. వీళ్ళ భవిష్యత్తేంటీ? పధ్నాలుగేళ్ళ అమ్మాయే అయినా.. సహజంగా స్త్రీ కుండే మాతృ హృదయం ఘోషించింది. ఒక్క సారి తలెత్తి ఆకాశం కేసి చూసి కనిపించని దేవుడిని ప్రశ్నించింది.

"అక్కా! అమ్మా, నాయన ఇంక రారా?" అమాయకంగా అడిగాడు నాగరాజు. అన్ని రోజుల తరువాత వాడికి అడగడానికి ఒకళ్ళు దొరికారు. వెంకమ్మ యాంత్రికంగా వాళ్ళని కాచుతోంది.. కానీ ఆ స్పర్శలో అక్కర కనిపించలేదా చిన్నారికి.

కడుపు తరుక్కుపోయినట్టయింది కృష్ణవేణికి.

"కిష్టమ్మ తల్లి మీ అమ్మనీ నాయన్నీ, మా అమ్మనీ నాయన్నీ, మా అన్ననీ పట్టుకు పోయిందిరా కన్నా!"

"ఎందుకక్కా? మనం కూడా ఎల్దామా? ఎల్లి ఆడనే చేపలు పట్టేద్దాం. కిట్టమ్మ తల్లి ఇంటో బోలెడన్ని చేపలుంటయ్యి కదా? మనల్నెందుకు తీసుకుని పోలే? అన్ని డబ్బులు వస్తయ్యా?" రెండు చేతులూ బార చాపి అడిగాడు రాజు.

కృష్ణవేణికి ఏం చెప్పాలో.. ఆ పసివాడిని ఎట్లా సముదాయించాలో అర్థం కాలేదు. దగ్గర్లోనే చింపిరి జుట్టేసుకుని నాంచారి, కళ్ళు పెద్దవి చేసి చూస్తోంది. దానికేం చెప్పినా అర్థం కాదు.

"వెళ్దామురా.. అందరం వెళ్ళేదే అమ్మా వాళ్ళున్న ఇంటికి. మరి కిష్టమ్మ మనల్ని కూడా పిలవాలి కదా! పిలిచే వరకూ మనం అల్లరి చెయ్యకుండా ఉండాలి. అక్క చెప్పినట్టే చెయ్యాల. అట్టగేనా?"

తలూపాడు నాగరాజు.. అమ్మ నాయన ఇంక రారని తెలిసి నట్టుగా.

బండ మీద నాలుగు ఉల్లిపాయలు, నాలుగు ఎండు మిరపకాయలు, ఇంత ఉప్పు వేసి నూరుతూ వెంకమ్మ అంతా గమనిస్తూనే

ఉంది. కృష్ణవేణి మనుషుల్లో పడుతున్నందుకు ఆనందంగానే ఉంది.. కానీ ఆ పిల్లల మీద ప్రేమ పెంచుకుంటుందేమో.. ఇందర్ని సాకడం సాధ్యమేనా? సాంబడు వచ్చాక ఇద్దర్నీ కూర్చోపెట్టి మాట్లాడాలనుకుంటూ, నూరిన పచ్చడి దాకలోకి తీసి, లోపలికి నడిచింది.

అన్న ఇంట్లోనే, కిరసనాయిల్ స్టౌ వెలిగించి అర్ధశేరు బియ్యం ఉంటే ఎసరు పెట్టి పోసింది. గంజి వార్చి, కుండలో దాచింది. రాత్రికి బియ్యం ఉంటుందో లేదో.. ఏదీ లేకపోతే గంజైనా తాగి పండుకోవచ్చు.

-----------------------------..

"అమ్మా! మాంచి వాసనేత్తాందే.. ఇన్ని రోజులకి కాస్త ఇల్లనిపిస్తాంది." సత్తు పళ్ళెంలో వేడి వేడి అన్నంలో ఉల్లి పాయ కారం కలుపుతూ అన్నాడు సాంబడు.

పక్కనే కూర్చుని, గిన్నెలో అన్నం మెత్తగా కలిపి, కొద్దిగా ఉప్పు, ఉల్లికారం వేసి, ముద్దలు చేసి, పిల్లల నోట్లో పెడుతోంది వెంకమ్మ. కృష్ణవేణి స్నానం చేసి, బట్టలు మార్చుకుని వచ్చింది. ఆ కాస్త శ్రద్ధ చూపినందుకే మొహం తేటగా ఉంది.

అదే కాల మహిమ. ఎన్నో భరించలేమనుకున్న విషయాలని తనలో దాచుకుంటుంది.. ఊరడించి ఓదారుస్తుంది. ఈ క్షణంలో ఎంతో ప్రాముఖ్యమయిన సంఘటన, ఒక సంవత్సరం ఆగుతే ఇంతేనా అనిపిస్తుంది. ఎంతో భయం, దుఃఖం కలిగించిన వార్తని ఒక చరిత్ర గా మారుస్తుంది. కొత్త కొత్తగా దొరికే ప్రేముడిలో బంధిస్తుంది.

"అమ్మాయ్! దా.. నీక్కూడా ముద్దలు పెడతా.." చేతినిండుగా కలిపిన ముద్దని కృష్ణవేణి నోట్లో పెడదామని చెయ్యి చాపింది వెంకమ్మ.

"మనిద్దరం తిందాం లే అత్తా! ముందు సాంబడు బావనీ, పిల్లల్నీ తిననీ. అంతలోకి నేను వాకిలూడిచి వస్తా." చీపురు తీసుకుని వెళ్తున్న కృష్ణవేణి వంక మాటల కందని భావంతో చూశాడు సాంబడు. ఆ చీపురు తను తీసుకుని ఊడిచేస్తే.. తొందరగా తినెయ్యసాగాడు.

"చాన్నాళ్ల తర్వాత, నోటికి ఇతవుగా ఎల్తాందమ్మా! నువ్వు, కృష్ణవేణి తినండి. అన్నం ఉందా, కాసిన్ని బియ్యం కడక్కరానా?"

"అక్కర్లేదురా.. అర్ధశేరు పైనే వండా.. రేపటికి మాత్తరం వస్తయ్యి బియ్యం. రేపేదైనా పనికెల్లాల్సిందే."

"అట్టగే." సాంబడు లేచి, తన పళ్ళెం శుభ్రంగా కడుక్కొచ్చాడు. పిల్లలిద్దరూ, కడుపులు నిండాయేమో.. వెంకమ్మ పరచిన బొంత మీద పడుక్కున్నారు.

"ఎల్లి, అన్నంతిను పా.. నేనూడుస్తా." కృష్ణవేణి చెంపని చూస్తూ, చేతిలో చీపురందుకున్నాడు సాంబడు.. నల్లగా కములుతోన్న చెంపని, చేత్తో సున్నితంగా తడమాలన్న కోరికని బలవంతంగా ఆపుకుంటూ.

తలొంచుకుని, చీపురు వదిలేసి లోపలికెళ్ళిపోయింది కృష్ణవేణి.

మనసులో చివుక్కుమంది సాంబడికి. నిజమే.. "అంత పెద్ద చెంప దెబ్బ కొట్టి ఉండాల్సింది కాదు.." అనుకున్నాడు. ఏ దెయ్యం పట్టిందో ఎదవపని చేశాడు. మొహం చిన్న బుచ్చుకుని ఊడవడం మొదలు పెట్టాడు.

"అమ్మా!" చిన్నగా అరిచింది కృష్ణవేణి. కమిలిన చెంపమీద వేడి నీళ్ళలో దళసరి బట్ట ముంచి నెమ్మదిగా వత్తుతోంది వెంకమ్మ.

"వట్టి మొరటు బండెదవ. ఇంత గట్టిగానా కొట్టేది. కాస్త ఓర్చుకోమ్మా. పిండి కట్టుకడ్తా. వాపు తీసేస్తుంది."

"సాంబడ్నేం అనద్దత్తా. నాదే తప్పు. పెద్దదానివని చూడకుండా నీకెంత కష్టం కలిగిస్తన్నా.. ఇప్పటికైనా కళ్ళు తెరిచుకునేట్టు చేశాడు. ఆనిక్కి సముద్రపొద్దుకెళ్ళి ఇసకలో ఎండ్రకాయలేవన్నా దొరకతయ్యేమో చూస్తా." పంటి బిగువున బాధ భరిస్తూ అంది కృష్ణవేణి.

అప్పుడే వాకిలి ఊడిచి లోపలికొస్తున్న సాంబడు ఆ మాట విన్నాడు. ముడుచుకున్న కనుబొమ్మలు విడివడ్డాయి.

అప్పటి వరకూ మనసులో తొలిచేస్తున్న బాధ చేత్తో తీసేసినట్లయి పోయింది. అదీ.. భరించరాని బాధ. నిద్రలో మెలకువలో అదే ధ్యాస.. అట్టా కొట్టుండాల్సింది కాదు. ఏ దెయ్యం పట్టిందో!

"అమ్మయ్య.. కిష్టవేణి నా బాధ అర్థం చేసుకుంది. ఇంక మదుసుల్లో పట్టానికి ఎక్కువ టయం పట్టదు." ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ తలుపు మూల చీపురు తగిలించి, గోడ వారగా ఉన్న చెప్పులు చేత్తో తీసుకుని వాకిట్లోకి నడిచాడు.

"అమ్మా! అట్టా ఊళ్ళోకి పోయొస్త. ఏం జరుగుతా వుందో.. బావయ్య వల బాగు చేయించడానికి కుదుర్తాదేమో చూస్తా. కొత్త వల కొంటానికి డబ్బుల్లేవు."

బావయ్య అన్నందుకు నాలిక్కరుచుకుని, కృష్ణవేణి వంక ఓరగా చూశాడు సాంబడు. అనవసరంగా దాని అన్న పేరెత్తా.. ఏం గోల చేస్తుందో అని భయ పడుతూ.

కృష్ణవేణి ఏం మాట్లాడకుండా లేచి దొడ్లోకెళ్ళి పోయింది.

"మస్తాన్ ని అడిగి చూడ్రా.. రిపేరింగ్ చేసిత్తాదేమో. ఇప్పటికి పని నడుస్తే.. ఆనిక్కి చూసుకోవచ్చు."

సాంబడు వాళ్ళింటి తాళం తీసుకుని వెళ్ళిపోయాడు

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments